## తెరపై మ్యాజిక్‌నే ఇష్టపడుతున్నారు!



'వేవ్స్' సమ్మిట్‌లో పాల్గొన్న అగ్ర నటుడు నాగార్జున అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ పెవిలియన్' స్టాల్‌ను ఆవిష్కరించారు. ఇందులో రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆడియో, విజువల్ రంగం గురించి, విజువల్ మీడియా మరియు కంటెంట్ క్రియేషన్‌లో హైదరాబాద్ ఓ శక్తివంతమైన కేంద్రంగా ఆవిర్భవించిన వైనాన్ని, వివిధ సినీ స్టూడియోల సమాచారాన్ని పొందుపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాగార్జున సమకాలీన సినిమాల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. నేటితరం ప్రేక్షకులు హీరోలను లార్జర్ దేన్ లైఫ్ రోల్స్‌లో చూడటానికి ఇష్టపడుతున్నారని, బాహుబలి, పుష్పరాజ్..రాఖీ (కేజీఎఫ్) సినిమాల భారీ విజయానికి అదే కారణమని చెప్పారు. 'మెజారిటీ ప్రేక్షకులు ఒత్తిడి పోగొట్టుకునేందుకు సినిమాలకు వస్తున్నారు. వారు నిజ జీవితానికి భిన్నంగా తెరపై జరిగే మ్యాజిక్‌ను చూసేందుకే ఎక్కువగా ఆసక్తిని చూపిస్తున్నారు. నేనూ అలాంటి సినిమాలనే ఇష్టపడతా. అయితే కేవలం హీరోల ఎలివేషన్స్‌తోనే అలాంటి సినిమాలు ఆడటం లేదు. వాటిలో బలమైన ఎమోషన్స్ కూడా ఉంటున్నాయి' అని నాగార్జున అన్నారు. ఆదివారం వరకు జరిగే వేవ్స్ సమ్మిట్‌లో పలువురు సినీ ప్రముఖులు పాల్గొంటున్నారు. శుక్రవారం అమీర్‌ఖాన్, కరీనాకపూర్, విజయ్ దేవరకొండ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పుడు అందరి సలహాలు వింటున్నా!



ముంబయిలో జరుగుతున్న వేవ్స్ (ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్) సదస్సులో పాల్గొన్న అగ్ర నటుడు అల్లు అర్జున్ తన కెరీర్‌తో పాటు పలు వ్యక్తిగత అంశాలపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. డీజే, నా పేరు సూర్య చిత్రాలు పరాజయం పాలవ్వడంతో దాదాపు ఏడాదిన్నర పాటు సినిమాలకు దూరంగా ఉన్నారు అల్లు అర్జున్. ఈ చిత్రాల విడుదలకు ముందు తాను ఎవరి సలహాలు పాటించలేదని, జీవితం పట్ల ఉదాసీన వైఖరితో ఉన్నానని బన్నీ తెలిపారు. ''నా పేరు సూర్య' రిలీజ్‌కు ముందు నా శ్రేయోభిలాషులు కొందరు కెరీర్ విషయంలో మంచి సూచనలు చేశారు. నేను పట్టించుకోలేదు. అంతా నేను అనుకున్నట్లే జరుగుతుందనుకున్నా. కానీ సినిమా ఫెయిల్యూర్ తర్వాత ఆరు నెలల బ్రేక్ తీసుకోవాలనుకున్నా. అది కాస్త 15 నెలలు అయింది. ఆ టైమ్‌లో నేను ఆత్మవిమర్శ చేసుకున్నా. ఇతరుల సలహాలు తీసుకోవడంలో తప్పులేదనిపించింది. అప్పటి నుంచి లైట్ బాయ్ సలహాలు కూడా స్వీకరించడానికి వెనకాడటం లేదు. కొందరు వ్యక్తిత్వ నిపుణుల సలహాలు తీసుకుంటూ కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నా' అని అల్లు అర్జున్ చెప్పారు. అట్లీ దర్శకత్వంలో చేయబోతున్న పాన్ వరల్డ్ సినిమా గురించి మాట్లాడుతూ..ఇప్పటివరకు భారతీయ సినిమాలో రానటువంటి కాన్సెప్ట్ ఇదని, భారతీయ మూలాలున్న ఈ కథని అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కించబోతున్నామని చెప్పారు. సినిమాల్లోకి రావడానికి తన మావయ్య చిరంజీవి స్ఫూర్తినిచ్చారని, ఆయన ఎన్నో గొప్ప విజయాలను చూసి కూడా వినమ్రంగా ఉంటారని, తనలాంటి నటులకు ఆయనే ఆదర్శమని అల్లు అర్జున్ అన్నారు.



## హృదయం లోపల.. ఖననం జరిగెనా..

దేవరకొండ విజయ్ హీరోగా రూపొందుతోన్న ప్రస్టేజియస్ పానిండియా ప్రాజెక్ట్ 'కింగ్‌డమ్' ప్రమోషన్స్‌తో దూసుకుపోతున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేస్తున్న నేపథ్యంలో.. శుక్రవారం ఈ సినిమాలోని తొలి గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'ఏదో ఏదో గమ్మత్తులా.. ఏంటీ కలా.. ఏంటీ కలా.. ఏదో ఏదో అయ్యేంతలా.. గుండె అలా.. ముంచేనిలా.. హృదయం లోపల.. ఖననం జరిగెనా..' అంటూ సాగే ఈ పాటను కె.కె. రాయగా, అనిరుధ్ రవిచందర్ స్వరపరిచి, అనుమిత నదేశన్‌తో కలిసి ఆలపించారు. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సేలపై ఈ పాట చిత్రీకరించారు. కథలో భాగంగా సాగే మాంటేజ్ సాంగ్ ఇది. హీరో క్యారెక్టరైజేషన్, హీరోహీరోయిన్ల మధ్య సాగే రహస్య ఒప్పందం.. తద్వారా వారిమధ్య చిగురించిన ప్రేమబంధం.. ఇవన్నీ ఈ పాటలో దర్శనమిస్తున్నాయి. ఈ పాటను బట్టి చూస్తే.. విజయ్ దేవరకొండ కిల్లర్‌గా, భాగ్యశ్రీ బోర్సే డాక్టర్‌గా కనిపిస్తున్నారు. పాట కూడా శ్రావ్యమైన సంగీతంతో వినసొంపుగా సాగింది. పిక్చరైజేషన్ కూడా ట్రెండీగా, కథపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ పాట విడుదల సందర్భంగా సంగీత దర్శకుడు అనిరుధ్‌కి హీరో విజయ్ దేవరకొండ ఎక్స్(ట్విటర్) ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు. '3, వీఐపీ చిత్రాల టైమ్‌లోనే అనిరుధ్ సంగీతానికి అభిమానిని అయిపోయా. అతనితో కలిసి పనిచేయాలనే కోరిక ఎప్పట్నుంచో ఉండేది. హీరోనైన పదేళ్ల తర్వాత నా పదమూడో సినిమాకు అది సాధ్యమైంది. మా తొలి కలయికలో మొదటి గీతం విడుదల కావడం సంతోషంగా ఉంది.' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదల కానుంది.


### దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో

## ఉత్తమ చిత్రంగా 'క'



నటుడు కిరణ్ అబ్బవరం నటించిన 'క' చిత్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 15వ 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్'లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తూ ఈ సినిమా టీమ్ ఆనందం వ్యక్తం చేశారు. నూతన దర్శకులు సుజిత్, సందీప్ దర్శకత్వంలో చింతా గోపాలకృష్ణరెడ్డి నిర్మించిన ఈ చిత్రం గత ఏడాది విడుదలై అఖండ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. నయన్ సారిక, తన్వీ రామ్ ఇందులో కథానాయికలు. కర్మసిద్ధాంతం నేపథ్యంలో సాగే ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం వాణిజ్యపరంగా విజయాన్ని సాధించడంతోపాటు విమర్శకుల ప్రశంసలందుకుంది.

## 'స్పిరిట్'లో ప్రభాస్ జోడీగా?



ప్రభాస్ 'స్పిరిట్' సినిమాలో కథానాయిక ఎవరనేది సస్పెన్స్‌గా మారింది. రోజుకో పేరు తెరపైకొస్తున్నది. మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో భాగం కానుందని ఇటీవలకాలంలో ప్రచారం జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ చిత్రంలో దీపికా పడుకోన్ నాయికగా నటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ మధ్యే ఆమె ఈ సినిమాకు ఓకే చెప్పిందని ముంబయి సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రానున్న 'స్పిరిట్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. అక్టోబర్‌లో సెట్స్ పైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలుత ఈ చిత్రంలో దీపికా పడుకోన్‌నే నాయికగా అనుకున్నారని, అయితే డేట్స్ అడ్జెస్ట్ చేసుకోలేక ఆమె వదులుకుందని తెలిసింది. ఇప్పుడు సినిమా షూట్ ఆలస్యమయ్యే పరిస్థితి ఉండటంతో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కొత్త షెడ్యూల్‌తో దీపికాను కలిశారట. అక్టోబర్ నుంచి తనకు వేరే సినిమాల కమిట్‌మెంట్స్ ఏమీ లేకపోవడంతో దీపికా పడుకోన్ వెంటనే సమ్మతించిందని తెలిసింది. 'స్పిరిట్' చిత్ర కథాంశంతో పాటు తన పాత్రను తీర్చిదిద్దిన విధానం దీపికాను బాగా ఇంప్రెస్ చేసిందని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు నిర్మించనున్నాయి.

## 17 ఏళ్ల తర్వాత...



దాదాపు పదిహేడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బాలీవుడ్ అగ్ర నటులు అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ కలిసి నటించబోతున్నారు. 'తషాన్' (2008) తర్వాత వీరిద్దరు కలిసి నటించలేదు. తాజాగా వీరు కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు తెలిసింది. ప్రియదర్శన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. ఇటీవలే దర్శకుడు వీరిద్దరికి స్క్రిప్ట్ వినిపించారని, కామెడీతో పాటు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పారని ముంబయ్ ఫిల్మ్ వర్గాల సమాచారం. ఆగస్ట్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుందని తెలిసింది. ప్రస్తుతం ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్న 'భూత్ బంగ్లా' చిత్రంలో నటిస్తున్నారు అక్షయ్‌కమార్. ఇది పూర్తయిన వెంటనే అక్షయ్–సైఫ్‌అలీఖాన్ కాంబో చిత్రాన్ని మొదలుపెట్టనున్నారు.

## రెండుశాతం ప్రజలే సినిమాలు చూస్తున్నారు



ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్‌లో పాల్గొన్న అగ్ర నటుడు అమీర్‌ఖాన్ భారతదేశంలో థియేటర్ వ్యవస్థపై ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. మన దేశ జనాభాకు ఇప్పుడున్న థియేటర్ల కంటే నాలుగింతల థియేటర్లు అవసరమవుతాయని అభిప్రాయపడ్డారు. '140కోట్ల జనాభాకు కేవలం 10వేల థియేటర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అదే 40కోట్ల జనాభా కలిగిన అమెరికాలో 40 వేల స్క్రీన్స్ ఉన్నాయి. చైనాలో లక్ష వరకు స్క్రీన్స్ ఉన్నాయి. ఇండియాలో పదివేల థియేటర్లలో సగం దక్షిణాదిలోనే ఉన్నాయి. అందుకే వసూళ్ల విషయంలో చాలా సినిమాలు వెనకబడుతున్నాయి' అని అమీర్‌ఖాన్ అన్నారు. రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన చిత్రాలను కేవలం మూడుకోట్ల మంది మాత్రమే వీక్షించారని, మన జనాభాలో వారు కేవలం రెండు శాతం మాత్రమేనని, మిగతా 98 శాతం మంది థియేటర్లకు ఎందుకు దూరంగా ఉంటున్నారో ఆలోచించాలని అమీర్‌ఖాన్ అభిప్రాయపడ్డారు. ఉత్తరాదిలోని చాలా జిల్లాల్లో సింగిల్ థియేటర్ లేని పరిస్థితి ఉందని, దీనిలో మార్పు వస్తేనే దేశంలో సినిమాకు మరింత ఆదరణ లభిస్తుందని అమీర్‌ఖాన్ చెప్పారు.

## దయచేసి బాధ్యతగా బతుకుదాం..



జైపూర్‌లో ఓ మహిళ మద్యం మత్తులో కారు నడుపుతూ.. ఓ బైక్‌ని ఢీకొట్టగా, ఆ బైక్‌పై ఉన్న బాలిక అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన ఈ ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై నటి జాన్వీ కపూర్ తన ఇన్‌స్టా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలాంటి నిర్లక్ష్యపు ప్రవర్తనను ఎవరైనా అంగీకరిస్తారా? మనిషి అన్న తర్వాత సోషల్ రెస్పాన్సిబిలిటీ కొంతైనా ఉండాలి కదా!. మద్యం తాగి వాహనం నడపడం వల్ల, నడుపుతున్న వారికే కాదు, చుట్టూ ఉన్న వారికి కూడా ప్రమాదమే. ఈ విషయం ఎందుకు అర్థంకాదు? మద్యం వల్ల ఇలాంటి ప్రమాదాలు దేశంలో గంటకు వందల్లో జరుగుతున్నాయి. తద్వారా ఎంతోమంది జీవితాలను కోల్పోతున్నారు. చట్టాలను గౌరవించడం మన ధర్మం. చట్టాలపై అవగాహన పెంచుకోవడం మన బాధ్యత. దయచేసి బాధ్యతగా బతుకుదాం.' అంటూ ఇన్‌స్టా ద్వారా స్పందించారు జాన్వీ. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఎన్టీఆర్ 'దేవర 2', రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రాల్లో ప్రస్తుతం జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే.

## ఎమోషనల్ కాన్సెప్ట్‌తో..



సోనుధి ఫిల్మ్స్ పతాకంపై ఓ చిత్రం రూపొందుతున్నది. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రంలో అశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్ ప్రధాన పాత్రధారులు. కిరణ్ కిట్టి, లక్ష్మీ చైతన్య కలిసి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఆర్.యు.రెడ్డి నిర్మాత. టాకీ పూర్తి చేసుకున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'ఇదో కొత్త రకం సినిమా. భావోద్వేగాలతో కూడుకున్న కథ కావడంతో నటీనటులు కూడా అద్భుతంగా నటించారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. జానీ మాస్టర్ కొరియోగ్రఫీతో త్వరలోనే పాటను చిత్రీకరిస్తాం. టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ కూడా త్వరలోనే విడుదల చేస్తాం. ఈ సమ్మర్‌లోనే విడుదల కూడా ఉంటుంది.' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్.

## గుర్రం పాపిరెడ్డి నవ్వులు..



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న డార్క్ కామెడీ థ్రిల్లర్ 'గుర్రం పాపిరెడ్డి'. మురళీ మనోహర్ దర్శకుడు. వెను సడ్డి, అమర్ బురా, జయకాంత్(బాబీ) నిర్మాతలు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఈ సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. పర్‌ఫెక్ట్ డార్క్ కామెడీ మూవీ ఇదని ఈ పోస్టర్ చెబుతున్నది. బ్రహ్మానందం, యోగిబాబు, రాజ్‌కుమార్ కసిరెడ్డి, జీవన్ కుమార్, వంశీధర్ కోసిగి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ: డా.సంధ్య గోలి.

## హంగర్ కామెడీ నేపథ్యంలో



కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్.జె.శివ దర్శకుడు. లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈచిత్రం విడుదలకు సిద్ధమైంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. పూర్తి వినోదాత్మకంగా సాగే హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇదని, అన్ని తరగతుల వారికీ సినిమా నచ్చుతుందని, ఇందులోని ప్రతి సన్నివేశం థ్రిల్‌ని పంచుతుందని, ప్రవీణ్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుందని దర్శకుడు చెప్పారు. వైవా హర్ష, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, కృష్ణ భగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: బాల సరస్వతి, సంగీతం: వికాస్ బడిస.

## స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రం



సామాజిక స్పృహను రేకెత్తించే పలు చిత్రాలను రూపొందించిన దర్శకుడు భాను తొలిసారి ఓ ప్రేమ కథా చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కనకదుర్గారావు పప్పుల నిర్మాత. సింగిల్ షెడ్యూల్‌లో నాన్‌స్టాప్‌గా ఈ చిత్రాన్ని పూర్తి చేశామని, నేటి యువతను ఆకట్టుకునే అన్ని అంశాలుంటాయని, కథానుగుణంగా ఐదు అద్భుతమైన పాటలు కుదిరాయని మేకర్స్ తెలిపారు. 'చైల్డ్ ఆర్టిస్టులుగా నటించిన ఓ అబ్బాయి, అమ్మాయి ఈ సినిమా ద్వారా నాయకానాయికలుగా పరిచయమవుతున్నారు. వారి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. నేటి తరానికి ప్రేమయొక్క గొప్పతనాన్ని తెలియజేసే విధంగా ఉంటుంది. త్వరలో టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం'అని దర్శకుడు భాను తెలిపారు.

## స్వీటీ లైనప్ అదిరింది



'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' తర్వాత అనుష్క నుంచి సినిమా రాలేదు. సాధారణంగా ఒక సినిమా విజయం సాధిస్తే.. దాని ఆసరాగా తీసుకొని పది సినిమాలకు సంతకాలు చేసేస్తుంటారు కథానాయికలు. కానీ అనుష్క మాత్రం అందుకు మినహాయింపే. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' విజయం తర్వాత ఆమె వరుసపెట్టి సినిమాలు ఒప్పుకోలేదు. నచ్చిన ప్రాజెక్ట్‌కే సంతకం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె తెలుగులో 'ఘాటి' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం.. షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల చేసేందుకు నిర్మాతలు రాజీవ్‌రెడ్డి, జాగర్లమూడి సాయిబాబు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర గంజాయి తోటల నేపథ్యంలో సాగే కథ ఇది. ఇదిలావుంటే.. ఈ సినిమాతో పాటు అనుష్క 'కథనార్' అనే మలయాళ సినిమా కూడా చేస్తున్నది. 9వ శతాబ్దంలో కడమట్టతు అనే క్రైస్తవ పూజారి కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతున్నది. ఇందులో అనుష్క 'కాలియన్ కట్టు నీల'గా కీలక పాత్ర పోషిస్తున్నది. అలాగే యూవీ క్రియేషన్స్‌వారు స్వీటీతో 'భాగమతి 2' చేయడానికి రెడీ అవుతున్నారు. అనుష్క అందుబాటుని బట్టి ఆ సినిమా పట్టాలెక్కుతుంది. హోంబలే ఫిల్మ్స్ నిర్మించనున్న సినిమాలో ప్రభాస్‌కి జోడీగా అనుష్క మెరవనున్నదని శాండిల్‌వుడ్‌లో ఓ టాక్ కూడా వినిపిస్తున్నది. ఈ లైనప్‌ని చూస్తుంటే.. స్వీటీ ఇన్నింగ్స్ మళ్లీ మొదలవ్వడం ఖాయమే అనిపిస్తున్నది.